క్లుప్తంగా

రేపు వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ సెల్ సమావేశం

అనపర్తి : వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీసెల్ విస్తృత స్థాయి జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం రాజమహేంద్రవరంలోని సంహిత కన్వెన్షన్ హాలులో నిర్వహించనున్నట్టు ఆ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాలి వేణు తెలిపారు. శుక్రవారం అనపర్తి వచ్చిన ఆయన మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయ కర్త డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి సమావేశానికి ఆహ్వానించారు. మధ్యాహ్నం 3గంటలకు జరిగే ఈ సమావేశంలో జిల్లా ఎస్సీ సెల్ సంస్థాగత నిర్మాణం అనే అంశంపై చర్చ జరగనుందని వేణు తెలిపారు.

ప్లాస్టిక్ నిషేధం అమలు చేయాలి

బిక్కవోలు: మండలంలో ప్లాస్టిక్ నిషేధం పక్కాగా అమలు చేయాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని పంచాయతీల్లో కార్యదర్శులు ప్లాస్టిక్ నిషేధాన్ని విధిగా అమలు చేయాలని ఆదేశించారు. దీనిపై వాణిజ్య, పరిశ్రమల, కిరాణా షాపుల నిర్వాహకులకు, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆగస్టు 15 నాటికి పూర్తి స్థాయిలో ప్లాస్టిక్ నిషేధం అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారని తెలిపారు.

ఆరోగ్యవంతమైన గ్రామాలను నిర్మిద్దాం



దోమాడలో తడి, పొడి చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెదపూడి: ఆరోగ్యవంతమైన గ్రామాల నిర్మాణానికి ప్రజలు సహకరించాలని ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి అన్నారు. దోమాడలో శుక్రవారం ఆయన పర్యటించి క్లాప్ మిత్రల చెత్త సేకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్తపై ప్రజలు అవగాహన పెంచుకుని, చెత్త సేకరించే క్లాప్‌మిత్రలకు సహకరించాలన్నారు. ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. తద్వారా సీజనల్ వ్యాధులు దూరమవుతాయన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి, సర్పంచ్ మీనవల్లి శారదదేవి, సచివాలయ కార్యదర్శులు లక్ష్మమ్మ, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎఫ్‌టీయూ అధ్యక్షుడికి అభినందన



మడికి సత్యం

పెదపూడి: అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఏఐఎఫ్‌టీయూ) ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడిగా జి.మామిడాడకు చెందిన మడికి సత్యం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం స్థానికంగా సత్యం మాట్లాడుతూ 22న పిఠాపురంలో జరిగిన 134వ జిల్లా మహాసభలో ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కరీం బాషా సమక్షంలో ఎన్నిక జరిగిందన్నారు. తనతోపాటు మరో పదిమందిని జిల్లా కార్యవర్గానికి ఎంపిక చేశారన్నారు. తనకు అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన కార్మిక ప్రతినిధులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. తనపై పెట్టిన బాధ్యతతో శక్తి వంచన లేకుండా కార్మిక హక్కుల కోసం నిరంతరం పోరాడతానని ప్రకటించారు. అమరుల త్యాగాలతో పోరాడి, సాధించుకున్న ఎనిమిది గంటల పని దినాన్ని రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం 10 గంటలకు పెంచి, నిర్ణయాలు తీసుకుంటున్నారని, దీనివల్ల కార్మికులపై భారం పడుతుందన్నారు. సత్యానికి ఏపీఆర్‌సీఎస్ జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

జూదరుల అరెస్ట్

అనపర్తి: పొలమూరులో పేకాటాడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.9,300 స్వాధీనం చేసుకున్నట్టు అనపర్తి ఎస్సై ఎల్.శ్రీనునాయక్ తెలిపారు. గురువారం రాత్రి అందిన విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. ఇందులో అనపర్తికి చెందిన చొల్లంగి ఏడుకొండలు, కర్రి నాగవెంకట కృష్ణారెడ్డి, సబ్బెళ్ల రామారెడ్డి, పొలమూరుకు చెందిన సీలంశెట్టి ప్రకాష్, అమరపు దుర్గాప్రసాద్, చిన్న పొలమూరుకు చెందిన చొల్లంగి శంకర్రావు, పీఆర్‌సీ పురానికి చెందిన గురుబిల్లి వెంకటరెడ్డిలను పట్టుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్సై వివరించారు.

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రజనీ

కోరుకొండ: బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మద్దిపాటి రజనీని నియమించినట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నీరుకొండ వీరన్నచౌదరి తెలిపారు. శుక్రవారం కోరుకొండ శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో స్వామిని దర్శించుకున్న అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు.

చిత్రలేఖన పోటీలు

సీటీఆర్ఐ: కృష్ణాష్టమిని పురస్కరించుకుని స్థానిక ఇస్కాన్ టెంపుల్‌లో శుక్రవారం విద్యార్థులకు చిత్రలేఖన, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. రాముడు, కృష్ణుడు, దశావతరాలు వంటి చిత్రాలను విద్యార్థులు అద్భుతంగా గీశారు.

వానాకాలం... వ్యాధుల గాలం

- మూగజీవాల సంరక్షణలో జాగ్రత్తలు అవసరం
- శ్రద్ధ తీసుకోవాలంటున్న అధికారులు



రాజానగరం: వర్షాకాలం అనగానే వ్యాధులు విజృంభించే సమయం. ఈ కాలంలో ముఖ్యంగా గొర్రెలు, మేకల పెంపకంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ప్రస్తుతం మూగజీవాలకు కొన్ని రకాల వైరస్‌లు సోకే ప్రమాదం ఉంది. అందుకే వీటి సంరక్షణలో జాగ్రత్తలు పాటించడంతో పాటు సకాలంలో వైద్యం అందించకపోతే మృత్యువాత పడే అవకాశం ఉందని పశు వైద్యులు చెబుతున్నారు. వాతావరణం చల్లగా ఉండటం, వర్షాలు తరచూ కురుస్తుండటంతో శరీర స్థితి బాగాలేని గొర్రెలు, మేకలు తొందరగా వ్యాధుల బారిన పడతాయి. సాధారణంగా పారుడు, మసూచి, న్యుమోనియా, జీర్ణకోశ సంబంధిత వ్యాధులు, దోమలు, కీటకాల కారణంగా తిక్క (సర్వ) రోగం ఎక్కువగా రావొచ్చు. ముందస్తు జాగ్రత్తలతోనే వీటిని నివారించవచ్చని పశు వైద్యులు సూచిస్తున్నారు.

రాజానగరం నియోజకవర్గంలోని మూడు మండలాల్లో మొత్తం 1,96,545 గొర్రెలు, మేకలు ఉన్నాయి. ఈ జీవాలను ఎక్కువగా ఆరుబయట ఉంచుతుంటారు. అక్కడ సరైన శుభ్రత లేకపోవడం, మకాంలో పరిమితికి మించి జీవాలను ఉంచడం, సరైన పోషణ లేకపోవడం కారణాలతో న్యుమోనియా వ్యాధి సోకుతుంది. ఈ వ్యాధి బారిన పడిన జీవాల్లో దగ్గు, జ్వరం, ముక్కు కారణం ఎక్కువగా కనిపిస్తాయి. సరిగ్గా మేత వేయకపోవడం వల్ల ఎక్కువగా నీరశించిపోతాయి. ముఖ్యంగా ఒకటి నుంచి తొమ్మిది నెలల వయసున్న గొర్రెలు, మేక పిల్లలు ఎక్కువగా ఈ వ్యాధి బారిన పడుతుంటాయి. ఒక్కో సమయంలో మరణాలకు కూడా చేరువవుతాయి. ఈ వ్యాధి నివారణకు గాలి, వెలుతురు బాగా వచ్చే ప్రాంతాల్లో వాటిని ఉంచడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. అలాగే వాటికి త్వరగా జీర్ణమయ్యే ఆహారం, శుభ్రమైన నీరు ఇవ్వాలి. వ్యాధి నుంచి పూర్తిగా కోలుకున్న తర్వాతే తిరిగి మందలలో కలపాలి.

మసూచి, బొబ్బ రోగాలు

మసూచి, బొబ్బ రోగాలు వైరస్ కారణంగా సోకుతాయి. వ్యాధి బారిన పడి మేతకు వెళ్తే గొర్రెలు, మేకల చర్మంపై బొబ్బలు కనిపిస్తాయి. తీవ్ర జ్వరం వచ్చి ముక్కు నుంచి నీరు కారుతుంటుంది. శ్వాసను కూడా సరిగా తీసుకోలేవు. అటువంటి వాటిని గుర్తించి మంద నుంచి తప్పించాలి. పుండ్లపై వేప నూనె రాయడం లేదా పశు వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలి.

నీలి నాలుక వ్యాధి

సాధారణంగా గొర్రెల్లోనే నీలి నాలుక వ్యాధి ఎక్కువగా కనిపిస్తుంది. ఈ వ్యాధి సోకిన గొర్రెలకు అధిక జ్వరం, కళ్లు, ముక్కుల నుంచి నీరు కారడం, నోరు, నాలుక వాచి నీలి రంగులోకి మారుతుండడం జరుగుతుంది. నోట్లో పుండ్లు ఏర్పడటం వల్ల ఆహారాన్ని తీసుకునేందుకు ఇబ్బంది పడుతుంటాయి. కాలి గిట్టలు, చర్మం కలిసే ప్రదేశంలో వాపు వచ్చి సరిగా నడవలేక కుంటుతుంటాయి. వ్యాధి ముదిరితే చనిపోతుంటాయి. చీకటీగలను నివారించడం ద్వారా ఈ వ్యాధిని అరికట్టవచ్చు.

తిక్క (సర్వ) రోగం

వర్షాలు కురిసే సమయంలో దోమలు, కీటకాల వల్ల గొర్రెలు, మేకలకు తిక్క (సర్వ) రోగం సోకడానికి అవకాశం ఉంది. వ్యాధిని త్వరగా గుర్తించి, వైద్యం అందించాలి. లేకుంటే ఆ జీవాలు మృతి చెందే ప్రమాదం ఉంటుంది. ఈ జీవాల మందల వద్ద సాయంత్రం వేళలో వేపాకు ధూపం వేయడం, ఆ ప్రాంతాలను అపరిశుభ్రతకు తావులేకుండా చూడటం మంచిది.

ముందు జాగ్రత్త చర్యలు ఇవీ..

గొర్రెలు, మేకలు ఉండే ప్రదేశాల్లో గాలి, వెలుతురు ఉండేలా చూసుకోవాలి. మూగజీవాలు వర్షాలకు తడిచేలా ఆరుబయట వదలరాదు. ఆరు బయటకు మేతకు వదిలే ముందు ఆయా ప్రాంతాల్లో వర్షం నీరు లేకుండా సూర్యరశ్మి తగిలేలా చూసుకోవాలి. ఈతకు వచ్చిన గొర్రెలను శ్రద్ధగా సంరక్షించుకోవాలి. వ్యాధులతో మృతి చెందిన గొర్రెలు, మేకలు తిన్న గడ్డిని ఇతర జీవాలకు ఆహారంగా ఉపయోగించరాదు.

వైద్యులను సంప్రదించాలి



వర్షాకాలంలో గొర్రెలు, మేకలు వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. అందువల్ల పెంపకందారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అవసరాన్ని బట్టి వెంటనే వైద్యం అందించేలా శ్రద్ధ తీసుకోవాలి. వైద్యుల సలహాలు, సూచనలు తీసుకోకుండా సొంత వైద్యం చేయడం మంచిది కాదు. జీవాలు నీరసంగా ఉన్నా, సరిగ్గా ఆహారం తీసుకోలేకపోతున్నా, దగ్గరలోని పశు వైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్ ఎంఎస్ఎస్ మూర్తి, సహాయ సంచాలకులు, పశు వైద్యశాల, రాజానగరం

'నన్నయ' వీసీ ప్రసన్నశ్రీకి అభినందన



వీసీ ఆచార్య ప్రసన్నశ్రీని సన్మానిస్తున్న అధ్యాపకులు, సిబ్బంది

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీకి చెందిన బోధన, బోధనేతర సిబ్బంది దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. 19 గిరిజన భాషలకు లిపిని రూపొందించిన నేపథ్యంలో ఇటీవల ఆచార్య ఆర్.సుబ్బకృష్ణ స్మారక అవార్డును ఆమె అందుకోవడంతో ఈ సన్మానం చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.విజయనిర్మల, అధ్యాపకులు కె.రమణేశ్వరి, టి.హైమావతి, కె.దీప్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రామసభ

సీతానగరం: రీసర్వేలో భాగంగా శనివారం మిర్తిపాడులో గ్రామసభ నిర్వహిస్తామని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ మిర్తిపాడులో రీసర్వేలో భాగంగా 13 నోటిఫికేషన్లు పబ్లికేషన్ చేశామన్నారు. డ్రాఫ్ట్ ఆర్ఓఆర్ పబ్లికేషన్ నిమిత్తం గ్రామసభను ఉదయం 9.30 గంటలకు గ్రామ సచివాలయంలో నిర్వహిస్తామన్నారు. గ్రామంలోని వ్యవసాయ భూములున్న రైతులంతా వారి భూముల వివరాలతో హాజరుకావాలని తహసీల్దార్ తెలిపారు.

వినూత్న రీతిలో మొండి బకాయిల వసూలు



రఘుదేవపురంలో రుణగ్రహీత ఇంటి వద్ద శాంతియుత నిరసన తెలుపుతున్న ఆర్‌టీపీఎం టీమ్

సీతానగరం: డీసీసీ బ్యాంక్ శాఖలు, సహకార సంఘాల ద్వారా ఇచ్చిన కొన్ని రుణాలు వాయిదా మీరి నిర్ధారక ఆస్తులుగా మారడంతో మొండి బకాయిల వసూలను వినూత్న రీతిలో చేపట్టారు. నాబార్డు, ఆప్కాబ్ వారి సూచనల మేరకు రికవరీ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా డీసీసీబీ అధికారులు సహకార సంఘ సీఓలు, సిబ్బంది రికవరీ టాస్క్‌ఫోర్స్ పీస్ మిషన్ (ఆర్‌టీపీఎమ్) టీమ్‌లుగా ఏర్పడ్డారు. వీరు సీతానగరం మండలం రఘుదేవపురం డీసీసీబీ బ్రాంచ్ పరిధిలోని పలు గ్రామాల్లో మొండి బకాయిలను వినూత్న రీతిలో వసూలు చేస్తున్నారు. డీజీఎం ఎం.శ్రీధర్‌చౌదరి, ఏజీఎం పి.కృష్ణమోహన్, రఘుదేవపురం డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ ఎం.క్రాంతికృష్ణ తదితరుల ఆధ్వర్యంలో శుక్రవారం రఘుదేవపురంలో రికవరీ డ్రైవ్ నిర్వహించారు. 'నమ్మకంగా తీసుకున్న రుణం నిజాయితీగా చెల్లించండి' అనే తదితర ప్లకార్డులు చేతపట్టి రుణగ్రహీతల ఇంటి వద్దకు వెళ్లి శాంతియుతంగా నిరసన తెలిపి, బాకీ చెల్లించాలని కోరారు. డీజీఎం శ్రీధర్ చౌదరి మాట్లాడుతూ జిల్లాలో రూ.700 కోట్ల మొండి బకాయిలు ఉన్నాయని, వాటి వసూలుకు ఆర్టీపీఎం టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ క్రాంతికృష్ణ మాట్లాడుతూ బ్రాంచ్ పరిధిలో 12 పీఏసీఎస్‌లు ఉన్నాయని, సుమారు రూ.3 కోట్ల మొండి బకాయిలు ఉన్నాయన్నారు. రాపాక, రఘుదేవపురం, వంగలపూడి, వెదుళ్లపల్లి తదితర గ్రామాల్లో ఆర్‌టీపీఎమ్ టీమ్‌లు రుణగ్రహీతల ఇళ్ల వద్దకు వెళ్లి శాంతియుతంగా నిరసన తెలిపామన్నారు. ఇతర డీసీసీబీ బ్రాంచ్‌ల మేనేజర్లు టి.లక్ష్మితులసి తదితరులు పాల్గొన్నారు

స్వాగతం... సౌభాగ్యలక్ష్మీ



బిక్కవోలులో పార్వతీదేవి



చంద్రేడులో శ్రీదేవి కనకదుర్గమ్మ వారు



సంపరలో విజయదుర్గమ్మ వారు



కరకుదురులో దుర్గాదేవి

- భక్తిశ్రద్ధలతో శ్రావణ మాసం తొలి శుక్రవారం పూజలు
- కిటకిటలాడిన ఆలయాలు

పెదపూడి: సౌభాగ్య లక్ష్మీ స్వాగతం అంటూ ఆ వరలక్ష్మీదేవిని భక్తులు మనసారా కొలిచారు. శ్రావణ మాసం తొలి శుక్రవారం సందర్భంగా సంపరలోని విజయదుర్గమ్మ వారి ఆలయంలో అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం సామూహిక కుంకుమ పూజలు, లలితా సహస్ర పారాయణ జరిగింది. అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన సూర్యనారాయణమూర్తి స్వామి, కోదండరామాలయం, అలాగే పెదపూడి, రామేశ్వరం, ఏపీత్రయం, పెద్దాడ, సంపర, తదితర గ్రామాల్లో శ్రావణమాసం పూజలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. కరకుదురులో దుర్గాదేవి అమ్మవారు శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు, చక్రపాణి ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

బిక్కవోలు: స్థానిక పార్వతీదేవి అమ్మవారి ఆలయంలో శ్రావణ శుక్రవారం పూజలు చేశారు. కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అలాగే వరలక్ష్మీ వ్రతాలు జరిగాయి. పందలపాకలో కట్లమ్మ తల్లి, కొమరిపాలెంలో కనకదుర్గమ్మ, తొస్సిపూడి నవదుర్గమ్మ, ఊలపల్లిలో కనకదుర్గమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

రంగంపేట: చంద్రేడులో శ్రీదేవి కనకదుర్గాదేవి ఆలయంలో శ్రావణ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణశర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

అంకితభావంతో బోధన సాగించాలి



రంగంపేట హైస్కూల్‌లో పేరమాంబను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

రంగంపేట: అంకితభావంతో బోధన సాగించాలని ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా ఉపాధ్యాయురాలు శ్రీపాద సీతామహాలక్ష్మి సత్యవతి పేరమాంబకు రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్ట్ తొమ్మిదో వార్షికోత్సవం సందర్భంగా మహోపాధ్యాయ పురస్కారం అందించారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో పేరమాంబకు సత్కార సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తెలుగు భాషలో పలు రచనలు చేసిన పేరమాంబ కృషి అభినందనీయమన్నారు. అనంతరం ఆమెను సత్కరించారు. పాఠశాల ఉపాధ్యాయులు వీసీ జాకబ్, గణేష్, ప్రసాద్, స్వాతికుమారి, సావిత్రి, వెంకటలక్ష్మి, భారతి, శైల, కామేశ్వరి, రమ్యసుధ, బుల్లెమ్మ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పారాలీగల్ వలంటీర్లకు శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జ్ ప్రధాన న్యాయమూర్తి మాధురి

కంబాలచెరువు: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పారాలీగల్ వలంటీర్లకు రెండు రోజుల పాటు జరిగే ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. స్థానిక కోర్టు ప్రాంగణంలో జరిగిన శిక్షణకు ముఖ్య అతిథిగా జిల్లా ఇన్‌చార్జ్ ప్రధాన న్యాయమూర్తి ఎం.మాధురి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ భారత న్యాయ సేవాధికార సంస్థ మార్గదర్శకాల మేరకు పారా లీగల్ వలంటీర్లు ఉచిత న్యాయం, లోక్ అదాలత్‌లు, లీగల్ అవేర్‌నెస్ క్యాంపులు, ఉచిత న్యాయ సలహా వంటి సేవలందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. మారుమూల ప్రాంతాల్లో కనీస రవాణా సదుపాయాలు లేక ప్రజలు న్యాయ సహాయం పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అటువంటి వారికి న్యాయ సేవలు అందించే బాధ్యత పారా లీగల్ వలంటీర్లపై ఉందన్నారు. పారా లీగల్ వలంటీర్లు ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ముందుండాలన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని సుమారు వందమంది పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.


అక్రమ అరెస్టులు దారుణం



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ నేతలను అక్రమంగా అరెస్టు చేయడం దారుణమని, కూటమి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లవరపు జాన్‌వెస్లీ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం కొంతమూరులోని ఎంపీఎస్ ఫంక్షన్ హాల్లో వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎం.విజయసారథి అధ్యక్షతన మండల స్థాయి నాయకులతో రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో నాలుగో దశ కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జాన్‌వెస్లీ మాట్లాడుతూ అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం, వైఎస్సార్ సీపీ గుర్తుచేస్తేనే తప్ప పథకాలు అమలు చేసే పరిస్థితి లేదన్నారు. ప్రజల పక్షాన పోరాడుతున్న వైఎస్సార్ సీపీ నేతలపై అక్రమ కేసులు బనాయించడం సరికాదని దుయ్యబట్టారు. క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు విజయసారథి మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా చంద్రబాబు చేసిన మోసాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. క్రైస్తవుల పట్ల వివక్ష చూపుతున్నారని, దీనిని అంతా తిప్పికొట్టాలన్నారు. ఆడబిడ్డ నిధి, రైతుభరోసా ఇంకా అనేక పథకాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. జిల్లాలో క్రైస్తవ నాయకులంతా రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసేందుకు కృషి చేయాలన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రవణ్‌కుమార్, రాజానగరం, అనపర్తి నియోజకవర్గాల అధ్యక్షుడు బి.జోనాథన్, దావీదురాజులు మాట్లాడారు. మండల స్థాయి నాయకులు స్పర్జన్ రాజు, అబ్రహం శామ్యూల్, ప్రేమ్‌కుమార్, అలెగ్జాండర్ తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వాడొద్దు



రూఫస్, ఎంపీడీఓ

రాజానగరం: సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వస్తువుల పూర్తి నిషేధానికి ప్రజలు సహకరించాలని ఎంపీడీఓ జేఏ రూఫస్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్లాస్టిక్ వినియోగాన్ని నిర్మూలించే దిశగా క్షేత్ర స్థాయిలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని మండల స్థాయి అధికారులను ఆదేశించారు. ఇదే విషయమై గ్రామాల్లో దండోరాలు వేయించాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌తో పర్యావరణ సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. ముఖ్యంగా వ్యాపారులకు ఈ విషయంలో సూచనలు చేయాలన్నారు. ఆదేశాలను ఉల్లంఘిస్తే శాఖపరంగా చర్యలు తీసుకోవాలన్నారు.

పొలమూరులో స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే

అనపర్తి: గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, మౌలిక వసతులు తదితర అంశాలపై కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే నిర్వహిస్తున్నట్టు జిల్లా కోఆర్డినేటర్ బి.పద్మిని తెలిపారు. కొప్పవరం, మహేంద్రవాడ, పొలమూరు గ్రామాలను ఎంపిక చేసి అక్కడి పరిస్థితులను పరిశీలిస్తున్నామని అన్నారు. ఈ సర్వేలో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలు, ఆలయాలు, జనావాసాల మధ్య ఉన్న మరుగుదొడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, పరిసరాల పరిశుభ్రత వంటి పలు అంశాలను అధికారులు పరిశీలించారు. సచివాలయ కార్యదర్శి జి.నాగ సుబ్రహ్మణ్యం, డీపీఓ కార్యాలయ రిసోర్స్ పర్సన్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన యువతి ఆచూకీ లభ్యం

సీతానగరం: అదృశ్యమైన ఓ యువతి ఆచూకీ కనుగొని తల్లిదండ్రులకు అప్పగించామని ఎస్సై డి.రామ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.. చినకొండేపూడికి చెందిన ఓ యువతిని తల్లి మందలించడంతో ఈ నెల 23న కళాశాలకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో తండ్రి ఫిర్యాదు చేశారు. గోరీపట్నం ఆలయంలో ఉందని తెలుసుకుని, కొన్ని గంటల్లోనే యువతిని తల్లిదండ్రులకు ఎస్సై అప్పగించారు.

రాపాక... చూడరు ఇటు వంక



రాపాక-కోటికేశవరం రోడ్డులో పేరుకుపోయిన చెత్తాచెదారం




రాపాకలో వెలగని వీధిలైట్లు

- పేరుకుపోయిన చెత్తతో రోగాల భయం
- పట్టించుకోని అధికారులు

సీతానగరం: మండలంలోని రాపాకలో పారిశుధ్యం క్షీణిస్తోంది. గ్రామంలో వెళ్లాలంటేనే భయపడేలా రోడ్డుకిరువైపులా చెత్తాచెదారం నిండిపోయింది. ఈ సమస్యపై పంచాయతీ అధికారులకు విన్నవించినా ప్రయోజనం శూన్యమని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో జిల్లా కలెక్టర్ ఇక్కడ పర్యటించిన సందర్భంగా శానిటేషన్ బాగా లేదని పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేశారు. అయినా పంచాయతీ అధికారుల తీరులో ఏ మాత్రం మార్పు లేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. రాజమహేంద్రవరం-సీతానగరం ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి రాపాకకు వెళ్లే రహదారికి ఇరువైపులా చెత్తాచెదారం డంపింగ్ చేస్తున్నారు. దీంతో పెద్దఎత్తున చెత్త కుప్పలు పేరుకుపోయాయి. అలాగే రాపాక శివారు కోటికేశవరం రోడ్డులోనూ చెత్త పేరుకుపోయింది. దీనిపై పంచాయతీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు పులి శ్రీనివాస్, సూదా భాస్కర్, సుందరపల్లి చైతన్య, నిఖిల్, ఆనంద్ తదితరులు వాపోయారు. అలాగే గ్రామంలో వీధి లైట్లు వెలగకపోవడంతో పలు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రివేళల్లో వీధిలైట్లు వెలగక బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడిందంటున్నారు. విషపురుగులు ఎక్కువగా సంచరిస్తున్నాయని భయాందోళనకు గురవుతున్నారు. పేరుకుపోయిన చెత్తతో దుర్వాసన వెదజల్లుతూ, దోమలకు ఆవాసాలుగా మారాయంటున్నారు. దీంతో అనేక మంది అనారోగ్యం పాలవుతున్నట్టు చెబుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి, పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని, వీధిలైట్లు సరిచేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

సొసైటీ భవనాన్ని నిర్మించాలి

కోరుకొండ: మండలంలోని గాడాల పీఏసీఎస్ ఏడాది కాలంగా అద్దె భవనంలో కొనసాగుతోంది. నెలకు రూ.ఐదు వేల వంతున అద్దె చెల్లించాల్సి వస్తోంది. సొసైటీ పాత భవనం శిథిలావస్థలో ఉండటంతో, ఏడాది క్రితం దానిని అద్దె భవనంలోకి మార్చారు. నాలుగు నెలల క్రితం పాత భవనాన్ని కూల్చేశారు. కొత్త భవనం నిర్మాణాన్ని ప్రారంభించాల్సి ఉంది. గాడాల, మధురపూడి, నిడిగట్ల గ్రామాలకు 600 మంది సభ్యులతో కూడిన ఈ సొసైటీ నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతోంది. సొసైటీ భవనాన్ని త్వరితగతిన నిర్మించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



గాడాలలో అద్దె భవనంలో ఉన్న సొసైటీ కార్యాలయం